క్లుప్తంగా

భూములను కాపాడండి



రుద్రూర్(కోటగిరి) : కోటగిరి గ్రామ శివారులో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోటగిరి తహసీల్దార్ శ్రీకాంత్ రావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించి సరిహద్దు ప్రాంతాల్లో నోటీస్ బోర్డులను ఏర్పాటు చేయాలని, ఎన్ని ఎకరాల భూమి ఉందో పేర్కొంటూ సర్వే నంబర్లు రాయాలన్నారు. వినతిపత్రం అందచేసిన వారిలో సీపీఐ జిల్లా నాయకుడు ఓమయ్య, మండల కార్యదర్శి విఠల్ గౌడ్ తదితరులున్నారు.

తారు రోడ్డు నిర్మాణం ప్రారంభం



వేల్పూర్ : వేల్పూర్, మోతె వాగులపై కొత్తగా నిర్మించిన వంతెనల వద్ద ఇరుపక్కల తారు రోడ్డు నిర్మాణ పనులు సోమవారం మొదలయ్యాయి. వేల్పూర్ వద్ద పెద్దవాగుపై రూ. 15 కోట్లతో, మోతె వద్ద కప్పల వాగుపై రూ. 12 కోట్లతో చేపట్టిన కొత్త వంతెనల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. రెండు వంతెనల వద్ద ఇరు పక్కల కాంక్రీట్ రోడ్డు వేసి చాలా రోజులైంది. కాంక్రీట్ రోడ్డు బలపడడంతో తారురోడ్డు నిర్మిస్తున్నారు. రెండ్రోజుల్లో తారురోడ్డు నిర్మాణం పూర్తికాగానే వంతెనలను ప్రారంభించే అవకాశం ఉంది.

జిల్లా మహాసభను సక్సెస్ చేయాలి



ఆర్మూర్: ధర్పల్లి మండల కేంద్రంలో ఈనెల 22న జరిగే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభను సక్సెస్ చేయాలని టీ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సూర్య శివాజీ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలో ఆయన మాట్లాడారు. బీడీ వర్కర్స్ యూనియన్ 50ఏళ్ల నుంచి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటంచేస్తూ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. ఈ కార్యక్రమం గ్రాట్ బేగం, ఔ కాంత, లక్కారం లక్ష్మి, విజయం, గంగు,రూప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోని పాఠశాలతో పాటు, దేగాం గ్రామాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌమార దశపై అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా వర్డ్ సంస్థ సభ్యులు లావణ్య, 8, 9, 10 తరగతి బాలబాలికలకు కౌమార దశలో వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు రాత పరీక్షలు నిర్వహించి అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు విజయ్‌కుమార్, పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లొంకలో ముగిసిన జాతర



సిరికొండ : జిల్లాలో ప్రసిద్ధ శైవ పుణ్య క్షేత్రమైన లొంకలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు జరిగిన జాతర సోమవారంతో ముగిసింది. చివరి రోజు కూడా మహేశ్వరుడి దర్శనం కోసం భక్తులు భారీగానే తరలివచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరించి సైకత లింగంను దర్శించుకొని పూజలు చేశారు. నాగరాజుశర్మ ఆధ్వర్యంలో పురోహితుల బృందం మహాశివుడికి అభిషేకాలు, అన్నపూజలు జరిపారు. భక్తుల సౌకర్యార్థం మండల కేంద్రం నుండి ఆర్టీసీ బస్సులను నడిపారు. ఆలయం వద్ద గల అల్లుబండపై భక్తులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మూడు రోజుల్లో లక్ష వరకు భక్తులు లొంకను దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, భూపతిరాజు, సంతోష్, మారుతి, గోపి, శ్రీనివాస్ తదితరులున్నారు.

గ్రంథ పాలకులేరి..?

- ఉమ్మడి బాల్కొండలో రెండు గ్రంథాలయాలు
- ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్న వైనం
- సమయపాలన కరువు



మూసి ఉన్న పోచంపాడ్ గ్రంథాలయం

బాల్కొండ : గ్రంథ పాలకులు లేక గ్రంథాలయల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. బాల్కొండ మండల కేంద్రంలో గ్రంథ పాలకుడు బదిలీపై గత రెండేళ్ల క్రితం వెళ్లారు. పోచంపాడ్ గ్రంథాయ గ్రంథా పాలకుడు నాలుగేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి గ్రంథాపాలకులతోనే గ్రంథాలయాలను నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి గ్రంథపాలకులు కావడంతో వారంలో ఒకటి, రెండు సార్ల కంటే ఎక్కువ సార్లు గ్రంథాలయానికి రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రంథాలయాల్లోకి వెళ్లి చదువుకోలేని దుస్థితి ఉందని వాపోతున్నారు. గ్రంథాలయాల్లో సమయం పాటించక పోవడం, ఎప్పుడు వచ్చి తెరుస్తున్నారో, మూస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. దీంతో గ్రంథాలయాల్లో చదువుకుందామంటే అవకాశం దక్కడం లేదని పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వార్తా పత్రికలను కూడ చదవలేని పరిస్థితిలో గ్రంథాలయాలు ఉంటున్నాయంటున్నారు.

అన్నీ సమస్యలే..

గ్రంథాలయాలు అనేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దానికి తోడు సిబ్బంది లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. పోచంపాడ్‌లోని గ్రంథాలయం శిథిలావస్థ భవనంలో కొనసాగుతుంది. రేకులషెడ్లులో నిర్మించిన ఇరుకు గది ఉండటంతో వర్షం కురిస్తే చిత్తడవుతోంది. పుస్తకాలు గతంలో ఎప్పుడో కొనుగోలు చేసిన పుస్తకాలో ఉన్నాయి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన పుస్తకాలు లేకుండా పోయాయి. గ్రంథాలయాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామాల్లో ప్రజలు వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

గ్రంథాలయాల్లో గ్రంథ పాలకులు ఉదయం , సాయంత్రం వేళాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. సమస్యల పరిష్కారం కోసం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. జిల్లావ్యాప్తంగా 23 గ్రంథాలయాలకు 9 మంది మాత్రమే ఉన్నారు.

– బుగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి, నిజామాబాద్

గ్రంథాలయం పనివేళలు పెంచాలి



మాట్లాడుతున్న అభ్యర్థులు

బోధన్ : పట్టణ కేంద్రంలోని లైబ్రరీలో పని వేళలు పెంచాలని కోరుతూ సోమవారం బోధన్ ఆర్డీవో రాజేశ్వర్‌ను కలిసి ఉద్యోగ అర్హత పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పలువురు అభ్యర్థులు కోరారు. ప్రస్తుతం స్థానిక లైబ్రరీలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు చదువుకునేందుకు అనుమతి ఉందని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పనివేళలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్డీవో లైబ్రేరియన్ సందీప్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి



బోధన్ ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మందర్నా రైతులు

బోధన్ : సాలూర మండలంలో మంజీర నదిఒడ్డున ఉన్న మందర్న గ్రామ ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన పేద రైతులు తాము సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. సాగుదారులతో కలిసి వచ్చిన హున్సా సొసైటీ మందర్న రవి మాట్లాడుతూ మందర్న గ్రామ నిరుపేద రైతుల 20 ఏళ్ల నుంచి ప్రభుత్వ భూముని చదును చేసి, కరెంట్ బోరుబావులు వేసుకుని వివిధ రకాల పంటలు సాగు చేసుకుని జీవిస్తున్నారని, వీరికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలి



బ్రహ్మంగారి చిత్రపటానికి స్థానికుల పూజలు

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని రాజారాంనగర్‌లో బ్రహ్మంగారి ఆలయ నిర్మాణం కోసం విశ్వ బ్రాహ్మణులకు కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని సంఘం సభ్యులు పేర్కొన్నారు. కాగా సోమవారం కొందరు వ్యక్తులు వచ్చి స్థలం తమకు చెందినదని విశ్వబ్రాహ్మణులతో వాగ్వాదానికి దిగారు. దీంతో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆ స్థలంలో బ్రహ్మంగారి చిత్రపటాన్ని స్థాపించి పూజలు నిర్వహించారు. 40 ఏళ్ల క్రితం బ్రహ్మంగారి ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇప్పుడు స్థలం కోసం కొందరు వ్యక్తులు ఇబ్బందులు గురిచేస్తున్నారని అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వడ్డీ లేని రుణాలివ్వాలి



ధర్నా చేస్తున్న పొదుపు మహిళా సంఘ సభ్యులు

బోధన్ : పొదుపు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయ హస్తం పథకాన్ని యధావిధిగా అమలు చేయడాలని డిమాండ్ చేస్తు సోమవారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ పొదుపు మహిళా సంఘాల సభ్యులు ర్యాలీ, ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరంఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల్లో రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం చేతులెత్తేశారన్నారు. మెప్మా, ఐకేపీల్లో పని చేసే సిబ్బందికి వేతనాలు పెంచి ప్రతి నెల రెగ్యులర్‌గా సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ జిల్లా, పట్టణ ప్రతినిధులు బీపాషాబేగం, యాదమ్మ, పద్మ,సూర్యకళ, గంగామణి, అనిత, పోషవ్వ, గంగవ్వయ, లస్మంబాయి మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి..



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య

రుద్రూర్(పోతంగల్) : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని భవిష్యత్తులో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య అన్నారు. పోతంగల్ మండలం కారేగాంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజాగోస బీజేపీ బరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, కో కన్వీనర్ గుత్ప భూపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు కాపుగాండ్ల శ్రీనివాస్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

బొప్పాపూర్‌లో..

రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో ప్రజాగోసా బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని ఆదివారం రాత్రి ఏర్పాటు చేశారు. బాన్సువాడ సెగ్మెంట్ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బీజేపీ జిల్లా నాయకుడు అశోక్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ తదితరులున్నారు.

'జిల్లా' ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా కోసం చేపట్టిన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని న్యాయవాదులు తెలిపారు. నియోజకవర్గంలో రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 64వ రోజుకు చేరాయి. దీక్షలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, ఏరాజ్‌పల్లిగ్రామ యువకుడు శివకుమార్, పలువురు న్యాయవాదులు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాది సిహెచ్‌వీ హన్మంత్‌రావు దీక్షలను ప్రారంభించారు.

మడిగెల కోసం వేలం పాట

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న మడిగెల అద్దె ఇవ్వడానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణధికారి రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ. 10 వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే మృతికి శ్రద్ధాంజలి



మాక్లూర్ : అనారోగ్యంతో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే గైని సాయన్నకు సోమవారం మండలంలోని వల్లభాపూర్ గ్రామస్తులు, గ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయులు శ్రద్ధాంజలి ఘటించారు. సర్పంచ్ మంజుల సుధాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు, ముందుగా దివంగత సాయన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుంకరి కములాకర్, హెచ్ఎం రాధా కిషన్‌రావు, దేవారెడ్డి, విజయరాజ్, శ్రీనివాస్‌గౌడ్, మహేష్, వరలక్ష్మి, కమిటీ సభ్యులు సూర్యప్రకాష్ తదితరులున్నారు.

కల్లుబట్టి తొలగించాలని ఫిర్యాదు



ఎడపల్లి : మండలంలోని ఎంఎస్సీ ఫారం గ్రామ శివారులోని ధర్మారంలో ఉన కల్లుబట్టీని తొలగించాలని కోరుతూ ధర్మారం సర్పంచ్ గోవురి పూజతో పాటు పలువురు గ్రామస్తులు సోమవారం బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, ఎక్సైజ్ సీఐ రూమ్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. కల్లు దుకాణం రహదారి పక్కనే ఉండటంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



వేల్పూర్ : వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ఎంపీటీసీ గుడాల గంగాధర్ తండ్రి గుడాల గంగా రాం స్మారక టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీని మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రారంభించా రు. గంగారాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు నాగధర్‌రెడ్డి, నాయకులు ఏనుగు గంగారెడ్డి, నల్లరమేష్, రాజారెడ్డి, గడ్డం నర్సారెడ్డి, ఆరె నితీష్‌కుమార్, సుధాకర్‌గౌడ్,గొల్లభూమన్న,యేంగంటి రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పసుపు, ఎర్రజొన్న రైతులను ఆదుకోవాలి



తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): పసుపు, ఎర్రజొన్నలను సాగు చేసిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ పెద్దల వైఫల్యాల వల్లే పసుపు పంటకు ధర లేకపోవడం, ఎర్రజొన్నలు సాగు చేసిన రైతులతో దళారులు ఆటలాడుకోవడం జరుగుతుందని ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ రైతు సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రజొన్నలకు మొన్నటి వరకు ధర ఉందని ఊదరగొట్టిన వ్యాపారులు ఇప్పుడు తమ లాభాలను పెంచుకోవడానికి ధర తగ్గించడం ఎంత వరకు న్యాయం అన్నారు. ఎర్రజొన్నలకు సంబంధించి సిండికేట్‌కు నాయకత్వం వహిస్తున్న ప్రధాన వ్యాపారి బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు అని ఆరోపించారు. ఎర్రజొన్నలకు ధర లభించేలా కలెక్టర్‌కు పురమాయించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి చర్యను తాము స్వాగతిస్తున్నామన్నారు. ఎర్రజొన్నలకు రూ.4వేలు, పసుపు పంటకు రూ.15వేల ధర లభించేలా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎంపీ అర్వింద్ మాట తప్పి రైతులను నట్టేటా ముంచారని ఎద్దేవా చేశారు. ఈనెల 23న నిజామాబాద్ మార్కెట్‌ను ముట్టడించనున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు రొక్కం మురళి, బద్దం రాజశేఖర్, మహిపాల్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



ఘన్‌పూర్‌లో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

రుద్రూర్ : చందూర్ మండలం ఘన్‌పూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, సర్పంచ్ దాసరి గంగారాం ప్రారంభించారు. గ్రామంలో శిబిరం ఐదు రోజుల పాటు కొనసాగుతుందని, గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దృష్టిలోపం ఉన్న వారికి మందులు అందచేయడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, జీపీ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రెంజల్‌లో వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

23 రోజుల పాటు..

రెంజల్(బోధన్) : రెంజల్ మండలంలో 23 రోజుల పాటు కొనసాగిన కంటి వెలుగు శిబిరం సోమవారంతో ముగిసింది. శిబిరంలో సేవలను అందించిన వైద్య సిబ్బందితో పాటు అంగన్వాడీలు, ఆశలకు రైతు వేదికలో స్థానిక సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ శాలువాలతో సత్కరించారు. ఆస్పత్రి వైద్యుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ 3,517 మందికి కంటి పరీక్షలు చేశామని, 556 మందికి గ్లాసులు అందించామన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారులు రవీందర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆడపిల్లలకు అండగా..



రెంజల్‌లో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న సర్పంచ్ రమేశ్‌కుమార్



ఆర్మూర్ పట్టణంలో..



చందూర్‌లోని మేడిపల్లిలో..

రెంజల్(బోధన్): రెంజల్ మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను సోమవారం స్థానిక సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ జీపీ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. గ్రామంలో ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రఫీక్, ఆసాని అనీల్, సాయాగౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ ఆధ్వర్యంలో షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు చైర్‌పర్సన్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చొరవతో ఎంతో మంది లబ్ధిపొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తాటి హన్మాండ్లు, బీఆర్ఎస్ నాయకుడు పండిత్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

రుద్రూర్ : చందూర్ మండలం మేడిపల్లి జీపీలో లకావత్ కిషన్‌కు మంజూరైన రూ. 39 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం సర్పంచ్ రవి, ఎంపీటీసీ శ్యాంరావ్ అందచేశారు. జీపీ కార్యదర్శి సీతారాం గబ్బర్ సింగ్, రాములు నాయక్ పాల్గొన్నారు.

రైతు ఉద్యమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న శోభన్

బోధన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల రైతు ఉద్యమాలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి సంఘం ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం తీసుకొస్తామన్న కేంద్రం హామీని తుంగలో తొక్కిందన్నారు. 10వ విడత రైతుబంధు డబ్బులు 10 లక్షల మంది సన్న చిన్నకారు రైతులకు అందలేదన్నారు. రైతు బీమా వయస్సును 18 నుంచి 75 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్ అప్ప, వెంకటేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యేశాల గంగాధర్‌లు పాల్గొన్నారు.

మోతె రాజరాజేశ్వరస్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తి



జాతరకు ముస్తాబైన రాజరాజేశ్వర ఆలయం

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె రాజరాజేశ్వర స్వామి జాతర మంగళవారం జరుగనుంది. జాతర కోసం స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు, ప్రతిఏటా మహా శివరాత్రి తర్వాత మూడు రోజులకు మోతె జాతర జరుగుతుంది. మహాశివరాత్రి తర్వాత మూడు రోజులకు గ్రామానికి పొలిమేరలో గుట్టవద్ద ఉన్న రాజరాజేశ్వరస్వామి ఆలయం వద్ద జాతర జరుపుతారు. దూర ప్రాంతాలలో ఉన్న గ్రామస్తులు జాతర ఉత్సవాలకు హాజరై ఉపవాసం ఉండడంతో పాటు నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తారు. సంప్రదాయబద్ధమైన పూజలు నిర్వహించి, రథోత్సవం నిర్వహిస్తారు. జాతర కోసం ఆలయాన్ని, రథాన్ని అందంగా ముస్తాబు చేశారు.